నవతెలంగాణ

1

ఆదిలాబాద్

సోమవారం | సెప్టెంబర్ 30, 2024 | www.navatelangana.com

బతుకమ్మ వీడియో సాంగ్ చిత్రీకరణ

కాసిపేట : మండలంలోని ముత్యంపల్లి ఎస్సీ కాలనీకి చెందిన గొడిసెల కృష్ణ నేతత్వంలో బతుకమ్మ సాంగ్‌ను చిత్రీకరించారు. గొడిసెల కృష్ణ పలు యూట్యూబ్ ఛానల్లకు జాన పద పాటలు రాస్తు రచయితగా మంచి పేరు తెచ్చుకుంటున్నాడు. గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రతి బతుకమ్మ పండుగకి పలు యూట్యూబ్ ఛానళ్ళకు బతుకమ్మ సాంగ్స్ రాసిస్తూ కాసిపేట వాసిగా మండలానికి మంచి పేరు తీసుకొస్తున్నాడు. అలానే ఈ సంవత్సరం కూడా ఒక సరికొత్త బతుకమ్మ వీడియో సాంగ్ ఓయిలాలో నా రామా సెందురాలో అనే పాటను మంచిర్యాల జిల్లాలోని పలు లోకేషన్స్‌లో వీడియో ఆల్బాన్ని చిత్రీకరిస్తున్నారు. ఈ వీడియో సాంగ్‌ను రుచిత క్రియేషన్స్ ద్వారా నిర్మిస్తున్నారు. సాంగ్ రచయితగా గొడిసెల కృష్ణ, గానం దుర్గం సునీత, హనుమంతు యాదవ్, హీరోయిన్‌గా నీతూ క్వీన్, నటీనటులుగా ముల్కల్ల మురళి, దుర్గం సునీత, గొడిసెల కృష్ణ, వెళ్తూరు పోషన్న, గొడిసెల అరుణ, తనుశ్రీ నటించారు. డైరెక్టర్‌గా మామిళ్ల లక్ష్మణ్, కెమెరామెన్ హరీష్ పటేల్ వ్యవహరిస్తున్నారు.



పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణకుమార్

ఆదిలాబాద్‌టౌన్ : ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్టీయూ) ఎన్నికలు ఆదివారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. రసవత్తరంగా సాగిన ఈ ఎన్నికల్లో ఒకే ప్యానల్‌కు చెందిన వారు గెలుపొందారు. జిల్లా అధ్యక్షులుగా మరోసారి కొమ్ము కృష్ణకుమార్ విజయం సాధించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా ఆయన ప్యానల్‌కే చెందిన తిరుతోపు నరసింహస్వామి గెలుపొందారు. మొత్తం 99ఓట్లకుగాను అన్ని పోలయ్యాయి. ఇందులో అధ్యక్ష స్థానం కోసం పోటీ చేసిన కృష్ణకుమార్‌కు 57ఓట్లు రాగా ఆయన ప్రత్యర్థిగా బరిలోకి దిగిన కుడాల రవీందర్‌కు 42 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శులుగా పోటీ చేసిన తిరుతోపు నరసింహస్వామికి 59ఓట్లు రాగా ఇదే పదవికి మరో ప్యానెల్ నుంచి బరిలోకి దిగిన సూర్యకాంత్‌కు 40 ఓట్లు వచ్చాయి. మిగిలిన కార్యవర్గానికి సైతం ఎన్నికలు జరుగగా ఇరు పక్షాలకు చెందినవారు విజయం సాధించారు. ఫలితాలు వెలువడిన అనంతరం గెలుపొందిన ప్యానెల్‌కు చెందిన వారు సంబరాలు జరుపుకున్నారు.



ఖానాపూర్ వాసులు ఆందోళన చెందొద్దు

- ఇండ్లు కూల్చివేస్తారన్న ప్రచారం అవాస్తవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఖానాపూర్ చెరువుకు అనుకుని నివాసముంటున్న స్థానికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇండ్లు కూల్చివేస్తారని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వే కేవలం భవిష్యత్తులో చెరువు మళ్లీ ఆక్రమణకు గురికాకుండా ఉండడం కోసమేనని స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులు కావాలనే స్థానిక ప్రజలను రెచ్చగొట్టి కాంగ్రెస్ పార్టీపై, సీఎం రేవంత్‌రెడ్డిపై ఉసిగొల్పుతున్నారన్నారు. హైడ్రా అనేది కేవలం హైదరాబాద్‌కే పరిమితమని, ఏ జిల్లాలోనూ రాలేదని అన్నారు. కేవలం వచ్చే స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో లబ్దిపొందడం కోసమే స్థానికులను ప్రతిపక్ష నాయకులు తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు తప్ప మరొకటి కాదన్నారు. ఖానాపూర్ చెరువు సమీపంలోని ఇండ్లు కూల్చివేయడం జరగదని, అందరూ ధైర్యంగా ఉండాలని, అందుకు తాము పూర్తి భరోసా కల్పిస్తున్నామని వెల్లడించారు. ఎలాంటి ఆందోళన అక్కర్లేదని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఎంఏ.షకీల్, ఖలీం పాల్గొన్నారు

సుప్రీంకోర్టు తీర్పును విరమించుకోకపోతే మాలల సత్తా చాటుతాం



నవతెలంగాణ-నిర్మల్

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విరమించుకోకపోతే మాలల సత్తా చాటుతామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ కె.వెంకటస్వామి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విరమించుకోకపోతే మాలాల సత్తా చాటుతామని అన్నారు. ఒకపక్క ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ఎత్తివేస్తామని, మరోపక్క ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ పద్ధతులను మానుకోవాలని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కమిటీలను జిల్లావ్యాప్తంగా అతి త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కార్యక్రమాలకు అంబేద్కర్ యువజన సంఘం, మాల సంక్షేమ సంఘం, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం, మాల మహిళా సంక్షేమ సంఘం, మాల విద్యార్థి సంఘం, మాల ఉపకులాల సంక్షేమ సంఘాలు ఒక్కతాటి పైకి వచ్చి మాల సమాజాన్ని జాగృతం చేస్తూ చైతన్య పరుస్తూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. మాల సమాజంలో ఏ ఒక్కరికి ఏ ఆపద వచ్చినా ఆదుకోవాలన్నారు. అతి త్వరలో జిల్లా కేంద్రంలో మాల గర్జన మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కో- కన్వీనర్స్ ఎలుమల రాజేశ్వర్, బొడ్డు లక్ష్మణ్, ఈరోల్ల పురుషోత్తం, సలహాదారులు వెలుమల ప్రభాకర్, డోంగ్రే లక్ష్మణ్, మైపాల్ ప్రభుదాస్, వెలుమల మధు, కొంతం అడెల్లు, గంగారపు రాజేశ్వర్, అంబకంటి ముత్తన్న, బండారి పోశెట్టి, ప్రభాకర్ షానే, కార్యవర్గ సభ్యులు ఏరోళ్ల ముత్యం, అనంతుల గంగయ్య, మీరా రాజేశ్వర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ 1998-99 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నాటి సంగతులను నెమరు వేసుకున్నారు. ఆ విద్యా సంవత్సరం తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 25సంవత్సరాల క్రితం తాము పదో తరగతి వరకు సారంగాపూర్ పాఠశాలలో చదివామని, అప్పటి మధుర స్మృతులు, తీపి సంఘటనలు గుర్తుకు వస్తున్నాయని, వాటిని నెమరు వేసుకొని ఆనందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కలయిక తమకు గర్వకారణంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించడం తమకెంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఈ నాటి కలయిక మరపురానిదని పేర్కొన్నారు. విద్యా బోధన చేసిన గురువులకు భక్తితో ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషాద్రి, రవిరాజ్, గణపతిరెడ్డి, గఫర్, సాయిరాం, గోవింద్‌రావు పాల్గొన్నారు.

రుణమాఫీ ఇంకా కాదేమీ..?

- కార్యాలయాలు, అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- సాంకేతిక తప్పిదాలతో అనేక మందికి దూరం
- దరఖాస్తులు అందించినా ఇప్పటి వరకు మాఫీ కాని వైనం
- రూ.2లక్షల పైన రుణం కలిగిన వారిలోనూ ఆందోళన
- సర్కారు నిర్ణయంపై ఆతృతగా ఎదురుచూపులు

జిల్లాలో రుణమాఫీ జరిగిన వారు సంతోషంగా ఉండగా.. వివిధ కారణాలతో మాఫీ కాని వారి బాధలు మాత్రం ఇంకా తీరడం లేదు. ఈ ప్రక్రియ ప్రారంభమై దాదాపు నెల రోజులు గడిచిపోయినా..ఇంకా పూర్తిస్థాయిలో మాఫీ కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కాని వారి వివరాలను సేకరించిన వ్యవసాయశాఖ అధికారులు జాబితాను ప్రత్యేక యాప్‌తో పాటు వివరాలను ప్రభుత్వానికి అందించారు. అక్కడ్నుంచి ఇంకా ఎలాంటి సమాచారం రైతుల దరికి చేరకపోవడంతో మాఫీ అవుతుందా..లేదా అనే అనుమానంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో రూ.2లక్షల లోపు ఉన్న వారిలో మాఫీ ప్రక్రియలో వివిధ సాంకేతిక తప్పిదాలు చోటు చేసుకోగా.. రూ.2లక్షలకు పైగా ఉన్న వారివి ఇంకా మాఫీ కాకపోవడంతో వారు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పంటలు సక్రమంగా పండక అప్పుల్లో కూరుకుపోతున్న అన్నదాతలకు ఆర్థికంగా అండగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియను చేపట్టింది. ఆగస్టు 15న ప్రారంభమైన ఈ క్రతువును మూడు విడతల్లో పూర్తిచేసింది. కానీ ఇందులో వివిధ రకాల లోపాలు తలెత్తడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకర్ల తప్పిదాలతో పాటు ఆధార్, ఖాతా సంఖ్యల్లో లోపాలు, పేర్లలో తేడాల కారణంగా కొందరు రైతులకు రుణం మాఫీ కాలేదు. తొలుత రూ.లక్షల లోపు ఉన్న వారికి రెండో విడతలో రూ.1.50లక్షలు కలిగిన వారికి మూడో విడతలో రూ.2లక్షల లోపు ఉన్న వారికి రుణాలను మాఫీ చేసింది. కానీ రూ.2లక్షలు రుణం తీసుకొని అప్పు కారణంగా అంతకుమించి ఉన్న వారి వారికి మాత్రం మాఫీ వర్తించకపోవడంతో అర్హులైన అనేక మంది రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోపక్క రూ.2లక్షల లోపు ఉన్న అనేక మందికి రుణం మాఫీ కాకపోవడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపడుతోంది. అలాంటి వివరాలను పంపించాలని అధికారులను ఆదేశించింది. వివరాలు సేకరించిన అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. కానీ మాఫీ కావడంలో ఆలస్యం జరుగుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఆ రైతులు 45వేల పైనే..!

జిల్లాలో రూ.2లక్షల రుణం తీసుకున్న రైతులు జిల్లాలో సుమారు 45వేల మందికి పైగా ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. వీరికి వడ్డీతో కలిపి రూ.2లక్షల కంటే అధికంగా అప్పు ఉండటంతో వారికి వర్తించలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం తొలి విడతలో 18,821మంది రైతులకు గాను రూ.120.79 కోట్లు మాఫీ చేయగా.. రెండో విడతలో 17,647మందికి రూ.201.89కోట్లు, మూడో విడతలో 19,493మందికి గాను రూ.286.26కోట్లు మాఫీ చేసింది. కానీ ఇంకా 45వేల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. మరోపక్క వివిధ సాంకేతిక తప్పిదాల కారణంగా మాఫీ కాని రైతులు జిల్లాలో 3750మంది ఉండగా.. కుటుంబ నిర్ధారణ కోసం 16,700మందికి మాఫీ నిలిచిపోయింది. దీంతో సాంకేతిక తప్పిదాలు కలిగిన రైతుల నుంచి జిరాక్స్ ప్రతులు తీసుకున్న వ్యవసాయశాఖ అధికారులు.. కుటుంబ నిర్ధారణ ప్రక్రియను మాత్రం ప్రత్యేక యాప్‌లో నమోదు చేసినట్లు చెబుతున్నారు.

ఈ ప్రక్రియ పూర్తయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడం కారణంగా బాధిత రైతులంతా ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. రుణం ఎప్పుడు మాఫీ అవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన రైతుల రుణాలను మాఫీ చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



మాఫీ కాని వివరాలు తీసుకుంటున్న వ్యవసాయాధికారులు

జైనథ్ మండలం దీపాయిగూడకు చెందిన ఈ రైతు పేరు మార రాంరెడ్డి. మహారాష్ట్ర బ్యాంకులో రూ.1.20లక్షలు పంట రుణం తీసుకున్నారు. రుణమాఫీ కాకపోగా..నాట్‌ఫౌండ్ అని చూపిస్తోంది. వ్యవసాయశాఖ ప్రకటించిన రుణమాఫీ జాబితాలోనూ పేరు లేకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి రైతులు జిల్లాలో అనేక మంది ఉండటం గమనార్హం.



రూ.2లక్షలకుపైగా ఉన్న వారికి మాఫీ చేయాలి : కంజాడే రాజేందర్, రైతు, ధనోర(బి)

ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. రుణం రూ.2లక్షలు రుణం తీసుకున్నప్పటికీ వడ్డీతో కొంత ఎక్కువ మొత్తంలో అవుతుంది. ఇలాంటి వారికి మాఫీ వర్తించలేదు. ప్రభుత్వం వడ్డీని మినహాయించి అసలు రుణం రూ.2లక్షల వరకు మాఫీ చేసి రైతులకు న్యాయం చేయాలి.



ఆర్కే-5 గనిలో దొంగతనం

- రూ.3లక్షల విలువ గల సెల్‌ఫోన్లు, రూ.వేల నగదు చోరీ
- సెక్యూరిటీ వైఫల్యం వల్లనే చోరీ జరిగిందంటున్న యూనియన్లు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 గనిలో శనివారం అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. రాత్రి డ్యూటీకి వెళ్లిన కార్మికుల లాకర్ల తాళాలను పగలగొట్టి అందులోని సెల్‌ఫోన్లు, కొంత నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. గతంలో కూడా ఇదే గనిలో దొంగతనం జరగడం గమనార్హం. కార్మికులకు సేఫ్టీ లాకర్లను ఇవ్వాలని పదేపదే యూనియన్లు, కార్మికులు చెబుతున్న యాజమాన్యం పట్టించుకోవడంలేదని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ దొంగతనాలకు యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

రూ.3లక్షల విలువగల సెల్‌ఫోన్లు, రూ. 5000 నగదు చోరీ

శనివారం రాత్రి షిఫ్ట్‌లో ఏ రిలే కార్మికులు తమ విలువైన వస్తువులను, బట్టలను దాచుకునే పెట్టెలను దొంగలు పగలగొట్టి అందులోని సామాగ్రిని ఎత్తుకెళ్లారు. సుమారుగా రూ.3లక్షల విలువగల సెల్‌ఫోన్లు, రూ.5వేల నగదు పోయిందని కార్మికులు పేర్కొంటున్నారు. వరుసగా దొంగతనాలు జరుగుతున్నా యాజమాన్యం చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు మండిపడుతున్నారు.





సెక్యూరిటీ విభాగం వైఫల్యం వలనే దొంగతనాలు : యూనియన్ నాయకులు

శ్రీరాంపూర్ ఏరియాలోని గనిలో శనివారం అర్ధరాత్రి దొంగతనం జరగడం సెక్యూరిటీ విభాగ వైఫల్యంతోనే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ ఆరోపించారు. శ్రీరాంపూర్ సింగరేణి ఎస్ అండ్ పీసీ విభాగంలో ఉన్నతాధికారులు ఇదే ఏరియాలో ఎక్కువకాలం పనిచేయడం వల్ల నిర్లక్ష్యంగా వివరిస్తున్నారని అన్నారు. దొంగతనాలు జరగడం మొదటిసారి కాదని, సెక్యూరిటీ విభాగంలో నియామకాలను చేపట్టకపోవడం వలన, సరిపడా సెక్యూరిటీ గార్డులు లేనంతనే దొంగతనాలు జరుగుతున్నాయన్నారు.

ఇలా దొంగతనాలు జరుగుతున్నాయని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవరించడం సరికాదని అన్నారు. సింగరేణి సంస్థ కోట్ల రూపాయల లాభాల్లో కార్మికుల కష్టం ఉందని, కానీ వారిని సంరక్షించడంలో యాజమాన్యం విఫలమవుతోందని అన్నారు. యాజమాన్యం ఉత్పత్తి పైనే దృష్టి సారించకుండా, కార్మికుల సంక్షేమంపై శ్రద్ధ వహించాలని, ఇప్పటికైనా దొంగతనాలు పునరావృతం కాకుండా చూడాలని, అలాగే కార్మికులకు సేఫ్టీ లాకర్లను అందజేయాలని తెలిపారు.

పీఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి

నవతెలంగాణ-నస్పూర్

పీఎంపీ చేసిన వైద్యం వికటించి మహిళ మృతి చెందిన సంఘటన నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నాగార్జున కాలనీలో చోటుచేసుకుంది. సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం నాగార్జున కాలనీకి చెందిన చింతం శ్రీలత(24)కు జ్వరం రావడంతో అదే కాలనీకి చెందిన పీఎంపీ ప్రశాంత్ దగ్గరకు తీసుకువెళ్లగా అతడు ఆమెకు ఇంజక్షన్ చేశాడని, అది వికటించడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు పరిస్థితి విషమించిందని మెరుగైన వైద్య నిమిత్తం కరీంనగర్‌కు తీసుకెళ్లాలని సూచించారు. కరీంనగర్ వైద్యులు సైతం హైదరాబాద్‌కు తరలించాలని సూచించడంతో అక్కడ వైద్యం పొందుతూ మహిళ మృతి చెందింది. వైద్యం వికటించడం వలన మహిళ మృతి చెందిందని తెలుసుకున్న పోలీసులు వైద్యున్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడు మహిళకు ఇచ్చిన ఇంజక్షన్‌ను స్వాధీనం చేసుకొని విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మంచిర్యాల జిల్లాలో పీఎంపీ, ఆర్ఎంపీల వైద్యం వికటించి ప్రాణాలు పోతున్న అధికారులలో చలనం రావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



జార్జిరెడ్డి స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడుదాం

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్



నవతెలంగాణ-హాజీపూర్

జార్జిరెడ్డి స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండలంలోని ర్యాలీ గడ్పూర్ ఎస్టీ బాలుర వసతిగృహంలో పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది వార్షికోత్సవాల పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడారు. 50 ఏళ్ల విప్లవ ప్రస్థానంలో అనేకమంది విద్యార్థి రత్నాలు పిడికిలి బిగించి జెండా కోసం తమ ప్రాణాలు తృణ ప్రాయం చేశారని తెలిపారు. జార్జిరెడ్డి మతోన్మాద కత్తిపోట్లకి ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నేల కొరిగాడని అన్నారు. జంపాల చంద్రశేఖర్, శ్రీపాద శ్రీహరి నాటి ఎమర్జెన్సీ చీకట్లో నాటి నియంతృత్వ పాలకుల తుపాకి తూటాలకు తమ ప్రాణాలని అర్పించారని గుర్తు చేశారు. కోలా శంకర్, చేరాలు, రంగవల్లి, స్నేహలత, మారోజు వీరన్న, మధుసూదన్, రాజు యాదవ్, యానాల వీరారెడ్డి, రమణయ్య, సాంబన్న లాంటి ఎందరో వీరులు తమ విలువైన ప్రాణాలని ప్రగతిశీల విద్యార్థి ఉద్యమానికి ఇచ్చి సంస్థని సమున్నతంగా నిలబెట్టారని అన్నారు .ఏ విద్యార్థి సంఘంకి లేని త్యాగాల చరిత్ర పీడీఎస్‌యూ సంస్థకి ఉన్నదని అన్నారు. ధ్వంసం అవుతున్న ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి విద్యా కార్పొరేటీకరణకి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు కోసం పీడీఎస్‌యూ పోరటం చేస్తుందని అన్నారు. అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే భారీ బహిరంగ సభను పూర్వ, ప్రస్తుత నాయకులు విద్యార్థి, విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలనీ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేష్ చైతన్య ప్రశాంత్, శివకుమార్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



సారంగాపూర్ : బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మే రాజు ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని బీరవెల్లి, వంజర్, ప్యారామూర్, మలక్ చించోలి గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ దేశ ప్రజలందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. దేశంలోని అణగారిన వారికి సంక్షేమ ఫలాలు అందించాలనే సంకల్పంతో బీజేపీ కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి బూత్‌లో 200 మందితో సభ్యత్వ చేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సభ్యత్వ నమోదు కన్వీనర్ సాధు రాంరెడ్డి, కరుణసాగర్‌రెడ్డి, ఎల్లన్న, కోరిపెల్లి రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, కాల్వ నరేష్, నవీన్ పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి బాలబాలికల కరాటే ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబర్ 1న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్ -14,17 బాలబాలికల జిల్లాస్థాయి కరాటే ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1-1-2008 తర్వాత పుట్టినవారు 17 సంవత్సరాల విభాగం, 1-1-2011 తర్వాత పుట్టిన వారు 14 సంవత్సరాల విభాగంలో ఎంపిక పోటీలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన క్రీడాకారులు సంబంధిత వయస్సు ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్‌తో ఉదయం 9 గంటలకు ఆదిలాబాద్ జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ముఖేష్ కుమార్, ప్రవీణ్ కుమార్‌కు రిపోర్ట్ చేయాలన్నారు. ఇతర వివరాలకు 9492209290, 9440720131 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బదిలీపై వెళ్లిన అధికారికి సన్మానం

నవ తెలంగాణ-సారంగాపూర్



మండలంలోని వ్యవసాయ అధికారిగా పనిచేసిన రాజశేఖర్ రెడ్డి బదిలీపై వెళ్లారు. ఆదివారం మండలంలోని కంకేట గ్రామంలో బీజేపీ నాయకులు ఆయనను శాలువతో సత్కరించి మెమోటోలను అందజేశారు. విధులు సక్రమంగా నిర్వహించిన వారికి ఎక్కడైనా ప్రజల ఆదరిస్తారని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారి మండల ప్రజల మన్నలలను పొందారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రావణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ మేకల లక్ష్మన్, సయాబ్ రావు, భోజన్న శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళా సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులుగా పద్మ



నవతెలంగాణ-తలమడుగు

మహిళా సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షురాలుగా కుమ్ర పద్మ ఎన్నిక కావడంతో ఆదివారం మహిళలు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ నెల 25న జరిగిన మహిళా సంఘర్షణ సమితి జిల్లా స్థాయి సమావేశంలో మహిళా సంఘర్షణ సమితి ఏర్పాటు చేసి పాత కమిటీని రద్దు చేశారు. అనంతరం కొత్త కమిటీని ఎన్నుకోగా కుమ్ర పద్మ జిల్లా అధ్యక్షురాలికిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా ఆమెను పల్సి(బి) తాండ, పల్సి (కే), రుయ్యాడి, భరంపూర్, ఆనందపూర్, సాంగ్వి, సోనాల, దీపాయిగూడ, కుచులాపూర్, లింగి, ఆదిలాబాద్ వివిధ గ్రామాల నుండి వచ్చిన మహిళలు పద్మ ఘనంగా సన్మానించారు.

పలువురికి పరామర్శ



నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల మండల కేంద్రానికి చెందిన చౌహాన్ హేమాజీ, రాజులగూడకు చెందిన జాదవ్ చంద్రు అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం పెద్ద కర్మ తెరివి కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, లంబాడి సమాజ పెద్దలు వారి కుటుంబానికి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి వారు చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి నాయక్, జేఏసీ మాజీ చైర్మన్ రాథోడ్ ఉత్తం, మాజీ సర్పంచ్ మధుకర్ రాథోడ్, రాథోడ్ సురేష్ నాయక్, బానోత్ జగన్, అడే ధర్మేందర్, చౌహాన్ రఘునాథ్, రాథోడ్ యశ్వంత్ రావ్, అడే వసంత్, అడే సురేష్, మాజీ ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, ప్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, పెసా చట్టం చైర్మన్ రాథోడ్ సికిందర్, ఆడే డిగాంబర్, రామారావ్, నేతావత్ రాందాస్,పవార్ దేవిదాస్, శివాజీ పటేల్, సూర్ సింగ్, హరిచంద్, ఫకిరా నాయక్, బాలాజీ ఉన్నారు.

సవాళ్లను అధిగమించేందుకు చెస్ ఎంతో దోహదం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మనిషి జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లను అధిగమించేందుకు చెస్ క్రీడ ఎంతో దోహదం చేస్తుందని గిరిజన క్రీడాలధికారి పార్థసారధి అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-15 జిల్లా స్థాయి చెస్ బాలబాలికల ఎంపిక పోటీల ముగింపును ఆదివారం మావలలోని చైతన్య పాఠశాలలో నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మొత్తం 70 మంది పాల్గొనగా ఇందులో 42 బాలుర, 28 బాలికలున్నారు. ఇక్కడ ఎంపికైన వారు అక్టోబర్ 29న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. చెస్‌ను ప్రతి ఒక్కరు చిన్నప్పటి నుంచి సాధన చేయాలన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ప్రతిభను చాటి జిల్లాకు మంచి పేరు తెవాలన్నారు. కార్యక్రమలో పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి స్వామి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీఈటీలు వినోద్, సాయి, నాగరెడ్డి, కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

మండలంలో కుక్కల బెడద



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఏ మారుమూల గ్రామానికి వెళ్లిన రోడ్లపై కుక్కల బెడదతో మండల ప్రజలు జంకుతున్నారు. ఏ కుక్క ఎటు నుంచి వచ్చి కాటేస్తుందోనని బిక్కుబిక్కు మంటూ గ్రామాల్లోని రోడ్లపై జనాలు తిరుగుతున్నారు. వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన మోహన్ రెడ్డి, ప్రేమేందర్, రాజన్న, సుభాష్ కుక్క కాటుకు గురికాగా కుక్కల భారీ నుండి కాపాడాలని రుయ్యాడి గ్రామస్తులు కోరుతున్నారు. కేవలం రుయ్యాడి గ్రామంలోనే 40 నుండి 50 కుక్కల వరకు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. రోడ్డు మార్గం గుండా వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. గతంలో మండల కేంద్రానికి చెందిన ఐదు సంవత్సరాల బాబు రుత్విక్‌పై కుక్కలు దాడి చేసి పెదవులు, చెంపపై గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో వారం రోజులు చికిత్స పొందారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుండి కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్ కోసం ఉద్యమిస్తాం

- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్
- జిల్లా కేంద్రంలో బీసీల సత్యాగ్రహ దీక్ష



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగనైతే పోరాడమే అదే విధంగా బీసీ రిజర్వేషన్ కోసం ఉద్యమిస్తామని, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేంత వరకు పోరాడుతామని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట బీసీ జనసభ, బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ ప్రకటించిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు కామారెడ్డి సభలో బీసీ రిజార్వేషన్ 42 శాతం ఇస్తామని ప్రకటించిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్న ఎలాంటి చర్యలు లేవన్నారు. రూ. లక్ష కోట్ల బడ్జెన్‌ను కేటాయిస్తామని చెప్పి విస్మరించారని ఆరోపించారు. ఎంబీసీలకు మంత్రిత్వ శాఖ ఇవ్వలేదన్నారు. కేవలం సీఎం తన సామాజిక వర్గానికే న్యాయం చేస్తూ బీసీలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో ఎలా అయితే ఏకతాటికిపై వచ్చి రాష్ట్రాన్ని సాధించుకున్నామో అదే తరాహ ఉద్యమాన్ని చేపట్టి బీసీ రిజార్వేషనుల సాధించుకుంటామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన కులపొల్లకే పదవులు ఇస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి బీసీల ఓట్లు కావాలి..పదవులు మాత్రం వద్దా..? అని ప్రశ్నించారు. బీసీల ఓట్లు కొల్లగొట్టడం కోసమే సీఎం చూస్తున్నారన్నారు. బీసీలను చైతన్య పర్చాడానికి జిల్లాల వారీగా కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ దీక్షలో ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ రవి కిరణ్ యాదవ్, బీసీ సంఘాల నాయకులు మేకల కృష్ణ, వేణుకుమార్, గజేందర్, కాశవేణి నారాయణ, హన్మండ్లు యాదవ్, ఈర్ల సత్యనారాయణ, అన్నదానం జగదీష్, రఘువీర్ యాదవ్, రవికాంత్, వేణు యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-బజార్హత్నూర్

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని మారుమూల గ్రామాలైన డేడ్రా, మాన్కపూర్ గ్రామాల్లో పర్యటించి గ్రామస్తుల బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం ఉమర్డ, డేడ్రా గ్రామంలో బాల వికాస్ వాటర్ ప్లాంట్లను ప్రారంభించి, ఈసారి తారు రోడ్డుపై కష్టంతో వచ్చానని, మళ్ళీ బీటీ రోడ్డు పూర్తి అయిన తరువాత వస్తానని పేర్కొన్నారు. అనంతరం మాన్కపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కష్టాలను, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని భూతాయి నుండి డేడ్రా వరకు రూ. కోటి 75 లక్షలు, డేడ్రా నుండి మాన్కపూర్ వరకు రూ. కోటి 55 లక్షలు, భూతాయి కె నుండి ఉమర్డ వరకు రూ.3 కోట్ల 77 లక్షలు, భూతాయి కె నుండి గిరిజాయ్ వరకు రూ. కోటి 10 లక్షలతో బీటీ రోడ్లు మంజూరు చేశారని వాటిని ఈ దసర తర్వాత కచ్చితంగా ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించడంలో ముందుంటాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వినియోగదారులకు హక్కుపై అవగాహన కల్పించడంలో తమ సంస్థ ముందుందని కంజూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీఆర్ఓ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించి కేక్‌కట్ చేశారు. అనంతరం ఇక్కడి మహిళ ప్రతినిధులను సత్కరించి అభినందనలు తెలిపారు. దేశంలో ఎక్కువ శాతం మహిళాలే కొనుగోళ్లు చేస్తారని, వారికి కోసం ప్రత్యేకంగా ఆదిలాబాద్ సంస్థ తరపున కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని సీఆర్ఓ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు అన్నారు. రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లాలో సభ్యులు యాక్టివ్‌గా పని చేస్తున్నారని తెలిపారు. వినియోగదారులకు వారి హక్కులను తెలియజేడానికి తాము ఎల్లప్పుడు ముందుంటామన్నారు. ప్రజలు కూడా వారు కొనుగోళుచేసే వస్తువుల నాణ్యత, ఇతర వాటిని సక్రమంగా చూడాలని కోరారు. అనంతరం పలువురు సంస్థలో చేరగా వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివకుమార్, రాజేష్, రాజు, మహిళ విభాగం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ హేమవతి, షేక్ ఇర్ఫాన్, మల్లేష్, గోలి శివ, బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటి అధ్యక్షుడు అజీజ్ ఉన్నారు.

గోల్డ్ మెడల్ అందుకున్న బాలుడికి సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ ద్వారా గోల్డ్ మెడల్ అందుకున్న స్థానిక పిట్టలవాడకు చెందిన మాజీ సైనికుడు జల్‌పేట్ రాజు జాహ్నవి దంపతుల నాలుగేండ్ల కుమారుడు సాయి లోహిత్‌ను స్మైల్ సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. చిన్న వయసులోనే బాలుడు ఇలాంటి ఘనత సాధించడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో స్మైల్ సొసైటీ ప్రతినిధులు కేమ శ్రీకాంత్, భూరె సురేష్, రామకృష్ణ, దత్తు పాల్గొన్నారు.

కుటుంబాలను పరామర్శించిన మాజీ జడ్పీటీసీ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని పల్లి(బి), భరంపూర్ గ్రామాలలో బాధిత కుటుంబాలను ఆదివారం మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి పరామర్శించారు. పల్లి(బి) గ్రామానికి చెందిన గిరిజన మహిళ మేశ్రం రేణుక బ్రెయిన్ ట్యూమర్‌తో మరణించింది. 45 రోజుల పసిపాప ఉంది. పాప పాల కోసం రూ. 5వేలను మానవత దృక్పథంతో భర్త మారుతికి అందజేశారు. అదే గ్రామానికి చెందిన కొడప లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా, భరంపూర్ గ్రామానికి చెందిన దాసరి భూమన్న మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ సోమన్న, మాజీ సర్పంచులు విట్టల్, మల్కు, సొసైటీ డైరెక్టర్‌లు ప్రతాప్, లింగారెడ్డి, గంగన్న, రావుల నారాయణ, నరసయ్య రాజన్న, ఆశన్న, బాపురావ్, గంగన్న గ్రామస్తులున్నారు.

19 ఏండ్లకు ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బేల మండలం సాంగిడి గ్రామానికి చెందిన 2004-2005 ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆకట్టుకుంది. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు గార్డెన్‌లో నిర్వహించిన ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒకరినొకరు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఎవరు ఏ స్థాయిలో ఉన్నారు. ప్రతి ఒక్కరు తమ తోటి స్నేహితుల కష్టసుఖాల్లో పాలుపంచుకొని చేదోడు వాదోడుగా తమ వంతు సహాయ సహకారాలను అందించాలని ప్రతిజ్ఞ చేశారు. ఇందులో భాగంగా ఆర్థికంగా వెనకబడి ఉన్న తమ తోటి మిత్రులను ఆపద సమయంలో ఆదుకునేందుకు జమచేసి ఆపద వచ్చినప్పుడు ఇచ్చేందుకు నిర్ణయించుకున్నారు. భవిష్యత్తులో ఏది ఏమైనా తమ పదవ తరగతి విద్యార్థులందరూ ఒకరినొకరు తమ కష్టసుఖాలను తోటి మిత్రులతో పంచుకోవాలని తోచిన సహాయాన్ని అందించి కష్టాల్లో ఉన్న తమ స్నేహితునికి అండగా నిలవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సామ రూపేష్ రెడ్డి, నగేష్, జైపాల్, నవనీత్ రెడ్డి, అరుణ్, అమరేందర్ రెడ్డి, దీపక్, అనిల్, గణేష్, కవిత, శరణ్య, శాలిని రెడ్డి, లలిత, మనిషా, అర్చన ఉన్నారు.

పూలే స్ఫూర్తితో కుల నిర్మూలనకు పోరాడుదాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాత్మ జ్యోతిబాపూలే స్ఫూర్తితో కుల నిర్మూలనకు పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగన్ సింగ్ అన్నారు. ఆదివారం మహాత్మ జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ స్థాపన 151వ వార్షికోత్సవం సందర్భంగా కుమురం భీమ్ భవన్ సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో కుల నిర్మూలన సదస్సు నిర్వహించారు. మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయిల చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్ సింగ్ మాట్లాడుతూ ఆదిమ సమాజంలో మనుషులందరూ సమానంగా జీవించారన్నారు. భారతదేశంపై ఆర్యుల దండయాత్ర తర్వాత పరిణామ క్రమంలో కులం ఏర్పడదన్నారు. మనుషుల మధ్య వివక్షత మంచి విషయం కాదని వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కుల నిర్మూలన పోరాటంలో కార్మికులు, కర్షకులు, యువకులు, విద్యార్థులు మహిళలు కలిసికట్టుగా పోరాడాలనారు. ప్రజల మధ్య ఐక్యతను సమానత్వ భావనను పెంపొందించడంలో మహాత్మ జ్యోతిబాపూలే పూలే ఆదర్శనీయడని తెలిపారు. స్త్రీలకు చదువు కావాలని పూలే భార్య సావిత్రికి చదువు నేర్పి మహిళలకు విద్య అందించే విధంగా ముందుకు నడిపారన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కొడప సురేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీడాం సాయికుమార్, కొముర అశోక్, పీఓడబ్ల్యూ నాయకులు సీహెచ్. తార బాయి, ఐఎఫ్టీయూ నాయకులు మనోజ్, కుమ్ర శత్రుఘన్, బుచ్చిరాం, సుందర్ సింగ్ ఉన్నారు.

కొట్నాక్ జంగు కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-నార్నూర్

ఆదివాసీ ఆణిముత్యం గోండిలిపి పండితుడు కొట్నాక్ జంగు మరణం ఆదివాసీ సమాజానికి తీరనిలోటని నంగారా భేరి జిల్లా అధ్యక్షుడు జాదవ్ సంజీవ్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని గుంజాల గ్రామంలో కొట్నాక్‌జంగు కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరరాస్యత తక్కువగా ఉండి నిరక్షరాస్యత అధికంగా ఉన్న రోజు నుంచి నేటి వరకు గోండిలిపి ప్రతులను దాచిపెట్టి ఉంచి ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు కొట్నాక్ జంగు అన్నారు. గోండిలిపిలోనే ఒకటి, రెండవ తరగతి వాచకాన్ని రాసిన మేధావి అన్నారు. అయన అందించిన సేవలు చిరస్మనియమన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కర్మన్కర్ బ్రీజులాల్, మాజీ సర్పంచ్ రాథోడ్ సావీందర్, జాదవ్ సోరాజీ ఉన్నారు.

డీసెట్ ధ్రువపత్రాల పరిశీలనకు మరో అవకాశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టీజీ డీసెట్-2024లో అర్హత ర్యాంక్ సాధించి గత ఆగస్టు నెలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకాని అభ్యర్థులకు మరొకసారి అవకాశం కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏ రవీందర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో అక్టోబర్ 1న ఉదయం10గంటల నుండి సా.5 గంటల వరకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో (గతములో వెరిఫికేషన్‌కు హాజరు కానీ అభ్యర్థులు) హాజరై సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ- స్కూల్ ఎడ్యుకేషన్ ప్రవేశానికి సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు చివరి అవకాశం ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. కావున ఉమ్మడి జిల్లాల్లోని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు భీం వర్ధంతిపై సమావేశం

నవతెలంగాణ-కెరమెరి



కుమురం భీం వర్ధంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఆదివాసీ భవనంలో భీం వర్ధంతి నిర్వహణపై సమావేశం ఉంటుందని ఉత్సవ కమిటీ చైర్మెన్ పెందూర్ రాజేశ్వర్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశానికి గిరిజన సంఘాలు, విద్యార్థి సంఘాలు ఉద్యోగ, యువజన, మహిళ సంఘాలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో భీం 84వ వర్ధంతి విజయవంతంపై కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు.

కోనేరు యువ సేన ఆధ్వర్యంలో శ్రమదానం

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని ముత్తంపేట్ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై గుంతలు పడి వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం కోనేరు యూవసేవ ప్రతినిధి గుజ్జ రమేష్ దృష్టికి రావడంతో తన సొంత ఖర్చులతో రోడ్డుపై ఉన్న గుంతలను మిక్సింగ్ కంకర వేసి పూడ్చారు. దీంతో ఆయన చేసిన పనికి పలువురు అభినందనలు తెలిపారు. ఆయన వెంట పలువురు గ్రామస్తులున్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మత్తు పనులు పూర్తి



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సవాతి, దాబా గ్రామ పంచాయతీల మధ్య గల మిషన్ భగీరథ పైప్‌లైన్ దెబ్బతిన్నాయి. ఈ విషయం అదనపు కలెక్టర్ దీపక్ తివారి దృష్టికి రావడంతో మరమ్మత్తులు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. దీంతో ఆదివారం మరమ్మత్తు పనులు పూర్తి చేశారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో వరద నీటి కారణంగా ఈ పైప్‌లైన్ దెబ్బతిని సంబంధిత గ్రామాలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తగా ఆసిఫాబాద్ డివిజనల్ పంచాయతీ అధికారి, పంచాయతీరాజ్ ఈఈ మండల పంచాయతీ అధికారులతో కలిసి సమస్యను పరిశీలించారు. గ్రామాలకు తాగునీటి సరఫరా పునరుద్ధరించేందుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపట్టే సూచనలు చేసి పూర్తి చేయడం జరిగిందని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు.

'ఆటలు మానసికోల్లాసన్నిస్తాయి'



నవతెలంగాణ-కౌటాల

ఆటలు మానసిక ఉల్లాసన్నిస్తాయని సీఐ ముత్యం రమేష్ అన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ మీకోసంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో సీఐ ముత్యం రమేష్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. పోలీస్, ప్రెస్ టీంలు తలపడగా పోలీస్ టీం విజయం సాధించింది. ఈ సందర్భంగా సీఐ ముత్యం రమేష్ మాట్లాడుతూ గ్రామాలలో బెట్టింగ్, జూదం, సైబర్ నేరాలు, గంజాయి మత్తు పదార్థాల నిషేదం కోసం పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ పోటీలలో కౌటాల, బెజ్జూర్ ఎస్సైలు మధూకర్, విక్రమ్, కౌటాల మండల పాత్రికేయులు పలువురు ఉన్నారు.

బాల్ బ్యాడ్మింట్‌లో ప్రతిభ

నవతెలంగాణ-రెబ్బెన

ఈనెల 25 నుండి 29 వరకు హర్యానా రాష్ట్రంలోని రోతక్ జిల్లాలో జరిగిన 43వ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలలో తెలంగాణ రాష్ట్ర టీం మూడో బహుమతి సాధించింది. తెలంగాణ రాష్ట్ర జట్టుకు మూడో స్థానం రావడానికి ప్రేమ్ దీప్ కృషి చేశాడు. అందుకు ఇండియన్ బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ దామెర ప్రేమ్ దీప్‌కు బెస్ట్ టాప్ ఫైవ్ ప్లేయర్‌లో బెస్ట్ అవార్డుతో సత్కరించారు. దామెర ప్రేమ్ దీప్ ఈ జాతీయ స్థాయి పోటీలో తెలంగాణ రాష్ట్ర టీం తరుపున కెప్టెన్‌గా వ్యవహరించారు. 43వ జాతీయ స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలో బెస్ట్ ప్లేర్ అవార్డు కైవసం చేసుకున్నాడరని ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కల నారాయణరెడ్డి తెలిపారు. అంతకు ముందు దామెర ప్రేమ్ దీప్ 2023లో కర్ణాటకలో సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ జాతీయ స్థాయిపోటీలో ఆడారు. దామెర ప్రేమ్ దీప్ గోలేటి గ్రామం సింగరేణి పాఠశాలలో 10 వ తరగతి చదువు తున్నాడు. ఈ జాతీయ స్థాయి బాల్ బాడ్మింటన్ బెస్ట్ ప్లేయర్ అవార్డు పొందినందుకు తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎస్ తిరుపతి, బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్, సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లయన్ నరసింగం, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు వంగ మహేందర్, కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్ఎం సంతోష్, మాసాడి రవితేజ, పీఈటీ భాస్కర్, సీనియర్ క్రీడాకారులు హరిలాల్, శంకర్‌లు అభినందనలు తెలిపారు.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తవటం శ్యాంసుందర్ కోరారు. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీలకు నాలుగు నెలల నుండి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ వేతనాలతో ఇబ్బందులు పడడం దారుణంగా ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతన విధానాన్ని అమలు చేయాలని, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు దుర్గం మారుతి, సీఆర్టీల సంఘం అధ్యక్షులు కొమరెల్లి శంకర్, ఉపాధ్యక్షులు కుర్సింగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జరుపుల విజేష్, నాయకులు గోగర్ల ప్రవీణ్, చేతన్, ప్రేమదాస్ పాల్గొన్నారు.



విద్యార్థినుల రక్షణే లక్ష్యం

- ప్రభుత్వ పాఠశాల్లో మార్షల్ ఆర్ట్స్ • మూడు నెలల పాటు శిక్షణ • జిల్లాలో 1634 పాఠశాలల్లో అమలయ్యే అవకాశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం సమాజంలో పాఠశాల విద్యలో విద్యార్థినులపై అఘాయిత్యాలు పెరుగుతన్నాయి. ఈ క్రమంలో వాటిని నివారించే ఉద్దేశంతో ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు కరాటే శిక్షణ ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. సెల్ఫ్ డిఫెన్స్ 'ఝాన్సీ లక్ష్మీబాయి స్కీం' ద్వారా విద్యార్థులకు మూడు నెలల పాటు కరాటే శిక్షణ ఇచ్చే విధంగా చేస్తున్నారు. దీంతో బాలికలపై జరుగుతున్న లైంగికదాడులు, అకాయితాల వేధింపుల నుంచి రక్షణగా ఉంటుందని ప్రభుత్వం భవించి దీన్ని అమలు చేయనుంది. దీనితో స్వీయ రక్షణకు అవకాశం కలగనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

జిల్లాలో 1634 పాఠశాలల్లో అమలు

పాఠశాలలు నివాస ప్రాంతాల్లో కాకుండా దూరంగా ఉండడంతో అక్కడికి వెళ్లే గ్రామంలో చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను నివారించడానికి వ్యక్తిగత రక్షణ కోసం కరాటే శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో మొత్తం 1634 వివిధ రకాల పాఠశాలలుండగా వీటిలో ప్రాథమిక పాఠశాలలు 908, ప్రాథమికోన్నత పాఠశాలలు 180, ఉన్నత పాఠశాలలు 170తో పాటు గిరిజన సంక్షేమ శాఖలో గిరిజన ప్రాథమిక పాఠశాలలు 330, ఆశ్రమ పాఠశాలలు 46 ఉన్నాయి. వీటన్నింటిలో కరాటే శిక్షణాను అమలు చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

కరాటే తరగతులతో స్వీయ రక్షణ

బాలికలకు కరాటే నేర్పడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో స్వీయ రక్షణ అవకాశం ఏర్పడనుంది. సెల్ఫ్ డిఫెన్స్ 'ఝాన్సీ లక్ష్మీబాయి స్కీం' ద్వారా విద్యార్థులకు మూడు నెలల పాటు కరాటే శిక్షణ ఇచ్చే విధంగా చేస్తున్నారు. గత సంవత్సరం ఇదే పథకం ద్వారా కాగజ్‌నగర్ డివిజన్‌లోని చింతగూడ, పెట్రోల్ పంప్ బట్టుపల్లి, సర్ సిల్క్ ఉర్దూ మీడియం పాఠశాల, 12వ వార్డు పాఠశాలల్లో శిక్షణ ఇవ్వగా ప్రస్తుత సంవత్సరం జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్



కరాటే శిక్షణ తీసుకుంటున్న బాలికలు

శిక్షకులకు ఉపాధి కల్పించాలి

కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా మూడు నెలల పాటు శిక్షణ ఇస్తూ దానికోసం ఏర్పాటు చేసే శిక్షకునికి నెలకు రూ.5000 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో మిగతా నెలలు ఉపాధి లేక కరాటే శిక్షకులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 12 నెలల పాటు కరాటే శిక్షకులను నియమించి, వారికి కనీస మొత్తాన్ని చెల్లిస్తే మరింత నాణ్యమైన శిక్షణ అందే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధి అవకాశం కల్పించాలి

దేవయ్య, కరాటే శిక్షకుడు

గత సంవత్సరం నుండి జిల్లాలోని పలు పాఠశాలల్లో కరాటే తరగతులు చెబుతున్నాను. అతి తక్కువ వేతనంతో మూడు నెలలు మాత్రమే పనిచేయాల్సి వస్తుంది. 12 నెలలు కొనసాగించి ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

ఉత్తర్వులు వెలువడగానే శిక్షకుల నియామకం

ఉదయబాబు, మండల విద్యాధికారి

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో కరాటే శిక్షకులను నియమించుకోవాలని తెలిపింది. అయితే తుది ఉత్తర్వులు వెలువడిన వెంటనే ప్రతి పాఠశాలలో కరాటే శిక్షకులను నియమించడం జరుగుతుంది. దీంతో విద్యార్థినులకు స్వీయ రక్షణ అవకాశం కలుగుతుంది.

ఇంటర్‌నెట్ సేవలు ఇంకెప్పుడు..?

- ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజల ఇబ్బందులు
- వ్యాపారస్తులకు తగ్గిన గిరాకీ
- ఆర్థిక ఇబ్బందుల్లో ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం పెరుగుతున్న ఆన్‌లైన్ విధానంతో పాటు ఇంటర్‌నెట్ ఉపయోగం నేపథ్యంలో మనిషి ప్రతి వ్యవహారం ఇంటనెట్‌తో ముడిపడి ఉందనేది జగమెరిగిన సత్యం. ప్రస్తుతం ఇదే ఏజెన్సీ ప్రాంతాల్లో శాపంగా మారింది. రానున్న రెండు రోజుల్లో ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించడం జరుగుతుందని అధికారులు శనివారం ప్రకటించారు. 26 రోజులుగా ఇంటర్‌నెట్ సేవలు లేకపోవడంతో ప్రజల అవస్థలు పడుతున్నారు.

ఇంటర్నెట్ సేవలు ఇంకెప్పుడు..?

జిల్లాలోని జైనుర్‌లో ఈ నెల 4న జరిగిన సంఘటన నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపై నియంత్రణలో భాగంగా జిల్లా అధికారులు జిల్లా వ్యాప్తంగా ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేశారు. తర్వాత ఐదు రోజుల్లో కాగజ్‌నగర్ డివిజన్‌తో పాటు ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి మండలాల్లో ఇంటర్‌నెట్ సేవలు పునరుద్ధరించిన ఏజెన్సీ మండలాల్లో నేటికీ సేవలు పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం జోడేఘాట్‌లో జరిగిన భీమ్ వర్ధంతి వేడుకల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి కూడా ఇదే విషయం ప్రస్తావనకు తీసుకురాగా, రెండు రోజుల్లో పునరుద్ధరిస్తామని జిల్లా అధికారులు తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజల ఇబ్బందులు

ప్రపంచం ఎంతో ముందుకు పోతున్న తరుణంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఏజెన్సీ ప్రాంతాలుంటున్నాయి. ప్రస్తుతం ఇంటర్‌నెట్ సేవలు కూడా నిలిపివేయడంతో బాహ్య ప్రపంచంలో ఏం జరుగుతుందో కూడా ఆ ప్రాంతంలో తెలియకపోవడంతో మునిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ఏజెన్సీ ప్రాంతాల పరిస్థితి తయారైంది. ఇంటర్‌నెట్ సేవలు నిలిపేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వ్యాపారస్తులకు తగ్గిన గిరాకులు

ప్రతి వస్తువుకు సంబంధించి ఆన్‌లైన్ మార్కెట్ పెరగడంతో పాటు ప్రభుత్వం పేపర్ మనీ వాడకం తగ్గించే ఉద్దేశంతో నగదు సేవలన్నింటిని ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చి ఫోన్ పే, గూగుల్ పే లాంటిది అలవాటు చేసింది. దీంతో ప్రస్తుతం చిన్న పండ్ల వ్యాపారి దగ్గర నుండి పెద్ద దుకాణాల వరకు వీటిపైన ఆధారపడుతున్నాయి. ఆన్‌లైన్ సేవలు లేకపోవడంతో అత్యావసరమైతేనే ప్రజలు పేపర్ మనీ వాడడంతో గిరాకులు తగ్గినట్లు ఏజెన్సీ ప్రాంతాల్లోని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులు

ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేత ఇతర వ్యాపారాలపై ఒక 50 నుండి 60శాతం ప్రభావం చూపెడితే, ఆన్‌లైన్ సెంటర్లపై 100శాతం ప్రభావం చూపెట్టాయి. 26 రోజులుగా సెంటర్లను నిర్వాహకులు తెరవడం లేదు. వీటిపైనే ఆధారపడి జీవిస్తున్న ఏజెన్సీ ప్రాంత నిర్వహకులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై ఇప్పటికే ఎస్పీ డీవీ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం కూడా అందజేశారు. మీసేవ, ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకుల బాధలు వర్ణనాతీతంగా మారాయి.

ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలి

అదే శంకర్, ఆన్‌లైన్ సెంటర్, నిర్వాహకుడు

26 రోజులుగా ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీనిపైన ఆధారపడి జీవిస్తున్నాం. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ఇంటర్‌నెట్ సేవలు వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

విద్యతో సమగ్రాభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యతోనే జ్ఞానం సంస్కారం వస్తుందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకులు కవి, రచయిత, గాయకుడు రేగుంట కేశవరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సాయిబాబా మందిరంలో ప్రముఖ కవి గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా నిర్వహించిన కవిసమ్మేళానికి ముఖ్యఅతిథిగా హాజరై గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాషువ దళితకవిగా సమాజంలో మార్పు కోసం గబ్బిలం కావ్యాన్ని రచించారని, సమాజంలో కుల వివక్షత రూపుమాపడానికి కృషి చేశారన్నారు. కుల వివక్షతపై నిరంతరం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కవి కోకిల, కవి విశారద లాంటి ఎన్నో బిరుదులు పొందారన్నారు. ఈ సందర్భంగా గుర్రం జాషువా రచించిన గబ్బిలం కావ్యంలోని పద్యాలను పఠించి సభికులను మంత్ర ముగ్ధులను చేశారు. అనంతరం సంస్థ సభ్యులు కేశవరావును పూలమాల శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అకసం అధ్యక్ష కార్యదర్శిలు నల్లగొండ రమేష్, శ్రీరామ్ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు గుర్రాల వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు మాడుగుల నారాయణ మూర్తి, ప్రచార కార్యదర్శి చిలుకూరి రాధాకృష్ణచారి, నాగోరావ్, మధుకర్ శర్మ, ఢిల్లీ విజయ్ కుమార్, విష్ణు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ముందస్తు సమాచారం మేరకు మండలంలోని ఎలుకపెల్లి గ్రామ శివారులో ఆదివారం ఎస్ఐ కొమురయ్య సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నాలుగు బొలేరో వాహనాలలో 36 పశువులను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కౌటాల, మర్తిడి, సలుగుపెల్లి గ్రామాల నుండి పశువులను కొనుగోలు చేసి పెద్దపెల్లిలోని రాజారాంపల్లి అంగడికి అమ్మడానికి అక్రమంగా తరలిస్తున్న బొలేరో వాహనాలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. బొలేరో డ్రైవర్, ఆయనతో ఉన్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు, పశువులను కాగజ్‌నగర్ గోషాలకు సంరక్షణ నిమిత్తం అప్పగించినట్లు తెలిపారు.

బాధిత బాలికకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలో గల ఓ గ్రామంలో లైంగికదాడికి గురైన బాలిక కుటుంబాన్ని అసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత బాలికకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియ చెల్లించాలన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ విద్యను అందించాలన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు పెరిగి మద్యపానం సేవించే వారి సంఖ్య పెరుగుతుందని, దీంతో నేరాల సంఖ్య పెరుగుతుందన్నారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ పరామర్శ

బాధిత బాలికను మాజీ ఎంపీపీ మల్లికార్జున్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికపై లైంగికదాడి చేసిన నిందితుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పెంటయ్య, గాజుల ప్రసాద్, సింగల్ విండో వైస్ చైర్మన్ ప్రహ్లాద్, సుబ్బారావు, మురళి, వినోద్, శ్రీనివాస్, లింగమూర్తి పాల్గొన్నారు.



బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ మల్లికార్జున్

సీపీఐ(ఎం) కిష్టాపూర్ గ్రామ కార్యదర్శిగా రజిత

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కిస్టాపూర్ గ్రామంలో ఆదివారం సీపీఐ(ఎం) గ్రామ శాఖ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు కొండగూర్ల లింగన్న, కూకటికారి బుచ్చయ్య, అంబటి లక్ష్మణ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను వెలికి తీసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసమే సీపీఐ(ఎం) నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అనంతరం గ్రామ కమిటీ కార్యదర్శిగా బండారి రజితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టణ వాసికి బీఆర్ అంబేద్కర్ సేవా రత్న పురస్కారం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించినందుకు పట్టణానికి చెందిన ఆయిల్ల విజయ్‌కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవ రత్న పురస్కారం అందుకున్నారు. ఆదివారం కరీంనగర్ పట్టణంలో జన సైన్యం దిన పత్రిక వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికలో జనసైన్యం పత్రిక యాజమాన్యం వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారిని అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా సామాజిక సేవా రంగంలో లక్షెట్టిపేట పట్టణానికి చెందిన ఆయిల్ల విజయ్ కుమార్‌ని ఎంపిక చేసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవా రత్న పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు రావడంతో సమాజానికి సేవ చేయడానికి మరింత రెట్టింపు ఉత్సాహం కలిగిందని, భాధ్యత మరింత పెరిగిందని ఇలాంటి ఒక వేదిక ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. జనసైన్యం పత్రిక యాజమాన్యానికి, కరీంనగర్ సీనియర్ పాత్రికేయులు గుంటపల్లి స్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చెరువులు, కుంటలు కనుమరుగు..!

- హద్దులు దాటుతున్న అక్రమార్కులు
- కబ్జాలకు గురవుతున్న శిఖం భూములు
- పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు, కుంటలు రానురాను కనుమరుగవుతున్నాయి. హద్దులు దాటి శిఖం భూములను రియాల్టర్లు దర్జాగా కబ్జా చేస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో పలుచోట్ల చిన్నచిన్న కుంటలు, మత్తడి కాలువలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. శిఖం భూములు ఆక్రమణలకు గురవుతుంటే అడ్డుకోవాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. దీని ఫలితంగా మండలంలోని ఇటిక్యాల చెరువు, బొట్లకుంట చెరువు, మంగలి కుంటలు అక్రమణాలకు గురై ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. అక్రమార్కులు శిఖం భూములను ఆక్రమించుకోవడమే కాకుండా వారి పేరున పట్టా చేసుకోవడం, వాటిని ప్లాట్స్‌గా చేసి అమ్ముకుంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో 12 చెరువులు 25 కుంటలు ఉన్నాయి. వీటికి హద్దురాళ్ళు లేకపోవడంతో చెరువులు, కుంటలు అక్రమార్కులు కబ్జా చేయడంతో విస్తీర్ణం తగ్గిపోతోంది.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతారు

ఈ నెల 13న కలెక్టర్ కుమార్ దీపక్ ఇటిక్యాల చెరువును పరిశీలించారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని, సమీప బొట్లకుంట చెరువు విస్తీర్ణం ప్రకారం కొలతలు వేయాలని మున్సిపల్ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని ఇటిక్యాల చెరువు నుంచి ప్రవహించే కాలువలను పరీక్షించి ఎఫ్‌టీఎల్ లెవెల్‌ను గుర్తించి ట్రెంచ్ వేస్తామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి మున్సిపాలిటీలోని ఇటిక్యాల చెరువు ఆక్రమణకు గురి అయిన తీరును అధికారులు పరిశీలించారు. ఇటిక్యాల చెరువు శివారులో మొరం పోసి ఆక్రమణకు గురి అయిన ప్రదేశాలను గుర్తించి చెరువు సరిహద్దులను నిర్దేశిస్తామని తెలిపారు. ఇటిక్యాల చెరువు పంట కాలువలను పరిశీలించారు. కాలువలను ఆక్రమించుకున్న తీరును పరిశీలించి పంట కాలువల మరమ్మత్తులు చేయించాలని ఆదేశించారు. అనంతరం నేషనల్ హైవే పక్కన ఉన్న ఇటిక్యాల చెరువును పరిశీలించగా కొందరు చెరువు తూములు, పంట కాలువులతో పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ పరిశీలించి చెరువుల మరమ్మత్తులు చేపట్టి ఆయకట్టు రైతులకు నీరు అందేలా తగు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.



చెరువులో హద్దురాళ్లు పాతి కబ్జా చేస్తున్న అక్రమార్కులు

రాజకీయ నాయకుల హస్తం..?

కొందరు రాజకీయ నాయకులే ధనార్జనే ధ్యేయంగా చెరువులో మట్టి పోస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. రియల్టర్‌లకు రాజకీయ నాయకులు, అధికారులు పరోక్షంగా సహకరించడంతోనే చెరువులు, కుంటలు కనుమరుగవుతున్నాయని ఆరోపనలు ఉన్నాయి. గతంలో నాటి కలెక్టర్లు ఆర్వీ కర్ణన్, భారతి హోళీకేరిలు చెరువుల హద్దుల ఏర్పాట్ల గురించి ప్రకటనలు చేసినప్పటికీ ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదు. ఈసారైన చెరువులను చెరపడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా.. లేదా అని స్థానిక ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

బొట్లకుంట చెరువుకు రక్షణ ఏది?..

మున్సిపల్ పరిధిలోని బొట్లకుంట చెరువు మొత్తం దాదాపుగా 12.28 ఎకరాల్లో విస్తరించి ఉంది. గతంలో చెరువు నుండి ఆయకట్టుకు సాగునీరు అందించే పరిస్థితి ఉండేది. అధికారుల పర్యవేక్షణ లోపంతో పాటు ఎఫ్‌టిఎల్ హద్దులు కేటాయించకపోవడంతో రియాల్టర్లు చెరువు శిఖం భూమి చుట్టూ ప్లాట్లు కనుగొలు చేసి అమ్ముతున్నారు.

కాలువలు సైతం ధ్వంసం

మండలంలోని గొలుసుకట్టు చెరువు ద్వారా గతంలో ఈ చెరువుకు వరద నీరు వచ్చేది. వర్షాకాలంలో గంపలపల్లి చెరువు నుంచి బొట్లకుంట చెరువుకు నీళ్లు వచ్చేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వరద నీటిని చేరవేసే మత్తడి కాలువను పూర్తిగా ఆక్రమించేసి కనుమరుగు చేశారు. తాజాగా మున్సిపాలిటీ పరిధిలోని చెరువులను కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. చెరువులపై ఎఫ్‌టీఎల్ హద్దులు లేకపోవడంతో ఏర్పాటు చేయాలని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెరువు పరిరక్షణపై, మత్తడి కాలువల ఆక్రమణపై దృష్టి సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గౌతమ్, ఇరిగేషన్ ఏఈ, మంచిర్యాల.

కలెక్టర్ ఆదేశాల మేరకు చెరువు భూములకు సంబంధించిన వాటిపై సర్వే నిర్వహిస్తున్నాం. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించిన అనంతరం హద్దులు ఏర్పాటు చేస్తాం ఇటిక్యాల చెరువుకు త్వరలోనే హద్దులు వేస్తాం. శిఖం భూములు కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని వారికి త్వరలోనే నోటీసులు అందజేస్తామని తెలిపారు.



లక్షెట్టిపేటలో చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు (ఫైల్)

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి



నవతెలంగాణ-నస్పూర్

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో నేడు జరిగే చలో హైదరాబాదును కాంట్రాక్ట్ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్పీ ఓసీపీ ఓబిలో పనిచేస్తున్న బ్లాస్టింగ్ కాంట్రాక్టు కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాల జీఓలను సవరించి వేతనాలు పెంచకపోవడం మూలంగా, చాలి చాలని వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నారన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనాల జీఓలను సవరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం 2007 నుంచి కనీస వేతనాల జీఓలను సవరించలేదన్నారు. పైగా తెలంగాణ ఏర్పడితే మా బతుకులు మారుతాయని ఆశపడ్డ కార్మిక వర్గానికి నిరాశే ఎదురైందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో కనీసం కాంట్రాక్టు కార్మికులు ఉన్నారని కూడా గుర్తించలేని పరిస్థితి నెలకొందని, ఇప్పుడు ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల గురించి, వారి వేతనాల గురించి పదే పదే మాట్లాడుతున్న కనీస వేతనాల జీఓలను విడుదల చేయడంలో నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తుందన్నారు. గెలిచిన నెలలోపే సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని కోల్బెల్టు ఎమ్మెల్యేలు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం హామీ ఇచ్చిన, తొమ్మిది నెలలు గడుస్తున్న వాటి ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. కార్మికులపై జాలి చూపుతే వారి కుటుంబాలు బతకవని, వేతనాల సవరణ చేసి జీతాలు పెంచితే కార్మికుల బతుకులో వెలుగులు నిండుతాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల జీఓలను గెజిట్ చేసి, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓబి బ్లాస్టింగ్ కాంట్రాక్టు కార్మికులు వెంకట్, తిరుపతి, సతీష్, గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలం



నవతెలంగాణ-తాండూర్

స్థానిక సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఈ సందర్భంగా తాండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని గ్రామాలలో ప్రజలంతా అనారోగ్య బారిన పడి విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైద్య వ్యవస్థను పటిష్టం చేయాల్సిన ఎమ్మెల్యే హైదరాబాద్‌లో ఉంటూ సమస్యలను గాలికి వదిలేశాడని అన్నారు. మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంలో గత ఎమ్మెల్యే మాదిరిగానే ఈ ఎమ్మెల్యే విఫలం అయ్యాడన్నారు. తాండూర్ మండలంలో తొలకరి మొదట్లో వర్షాలు పడక సగం మంది రైతులు వరి నాట్లు వేయలేదని, అనావష్టి వాళ్ళ నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. తాండూర్ మండలంలోని ఐబి సెంటర్‌లో కూరగాయల సంత వద్ద మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సభ్యత్వ నమోదు పై మండల సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు విజయవంతంగా కొనసాగుతుందని మండలంలో సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్ కుమార్, సభ్యత్వ నమోదు కన్వీనర్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనగందుల కృష్ణమూర్తి, సభ్యత్వ నమోదు జిల్లా కోకన్వీనర్ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నౌనూరి సుధీర్ గౌడ్, ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి, తుకారాం, రామగౌని మహీధర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల ఉపాధ్యక్షుడు సిద్ధం మల్లేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్ పాల్గొన్నారు.

మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ద్వారా ప్రతి సంవత్సరం మహిళలకు బతుకమ్మ కానుకగా అందజేస్తున్న చీరలను ఆదివారం లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 6 వార్డ్ మోదెలలో బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫోర్ లీడర్ చెల్ల నాగభూషణం మాట్లాడుతూ మహిళలకు తమ నాయకుడు ప్రేమ్ సాగర్ రావు అధికారంలో ఉన్నా లేకున్నా 10 సంవత్సరాల పాటు నియోజకవర్గ ఆడపడుచులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తానని చెప్పి ఇచ్చిన మాటకు కట్టుబడి బతుకమ్మ కానుకగా ఆడపడుచులకు చీరలను కానుకగా అందజేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరల పేరిట దోచుకోవడం కాకుండా నాణ్యత లేని చీరలు పంచి మహిళలను అగౌరపరిచారని తెలిపారు. త్వరలోనే లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభించి మొదెల రైతుల అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రమేష్ పాల్గొన్నారు.



ఐటీ మాఫీ, సొంతింటి కల నెరవేర్చాలి : సీఐటీయూ

నవతెలంగాణ-మందమర్రి

కార్మికుల అలవెన్స్‌లపై ఐటీ మాఫీ సొంతింటి కల డిమాండ్‌లను నెరవేర్చాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రామకృష్ణాపూర్ సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు రామగిరి రామస్వామి, బ్రాంచ్ కార్యదర్శి అల్లి రాజేందర్‌లు మాట్లాడుతూ గత సంవత్సరం లాభాలపై గుర్తింపు సంఘం ప్రతిపక్షంలో ఉండగా 35 శాతం వాటా కోసం పోరాడి 33 శాతం ఇప్పించిందన్నారు. పన్నులు పోగా తీసివేసిన లాభాలపై వాటాను చెల్లించకుండా సగం లాభాలు పక్కకు పెట్టి మిగతా లాభాలపై పంచడాన్ని కార్మికులందరూ విమర్శిస్తున్నారన్నారు. ఈ విషయంలో గెలిచిన సంఘాలు విఫలమయ్యాయని అన్నారు. 2021-22లో యాజమాన్యం విడుదల చేసిన కరపత్రానికి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు విడుదల చేసిన కరపత్రానికి తేడాలను గమనించుకోవాలని కార్మికులకు సూచించారు. ఇప్పటికైనా యాజమాన్యం లాభాలపై కార్మికుల్లో ఉన్న అశాంతిని పోగొట్టడానికి గతంలో కరపత్రం విడుదల చేసిన ఆనవాయితీ ప్రకారం ఈసారి గత 10 సంవత్సరాల లాభాల లెక్కలను విడుదల చేసి కార్మికులకు తెలుపాలని అన్నారు. 10 నెలల క్రిందట గెలిచి నెల కింద గుర్తింపు పత్రం తీసుకున్న కూడా ఇప్పటివరకు స్ట్రక్చర్ సమావేశాల జాడలేదన్నారు. మీకున్న కాలపరిమితి కేవలం 2 సంవత్సరాలేనని అందుకే మొదటి సమావేశంలోనే కార్మికులకు అలవెన్స్‌లపై ఐటి మాఫీ, సొంతింటి కల డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనేక సమస్యలు ఉన్నాయని కేకే ఓసితో పాటు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని క్వార్టర్ లేని కార్మికులకు మున్సిపాలిటీ ప్రకారం ఇంటికిరాయి, కాసిపేట-1,2 గనులకు వెళ్లడానికి ఓసి పక్కనుండి వేసిన రోడ్డు వెంబడి లైటింగ్ ఏర్పాటు చేయడం ప్రాతినిధ్య సంఘంగా ఉన్నప్పటి నుంచి విఫలమయ్యారని, ఇప్పుడైనా గుర్తింపు సంఘంగా పెండింగ్ సమస్యలపై స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహించి పరిష్కరించాలని కోరారు. ఇతర సంఘాలను విమర్శించడంలో చూపే శ్రద్ధ స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహించి కార్మిక సమస్యలు పరిష్కరించడంలో చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంకె వెంకటేష్, జి విద్యాసాగర్, కె చైతన్యరెడ్డి, రమేష్, అభిలాష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామగిరి రామస్వామి

చింతలపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతలపల్లి గ్రామంలో అధిత్య ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్టు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మగ్గిడి తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపల్లే గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని వైద్యా శిబిరంలో నిర్వహించిన ఉచిత పరీక్షలు మందులు తీసుకొని వారికి ఉన్న సమస్యలను డాక్టర్ హెలమలత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు వైద్యులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి రాము, అజ్మత్ ఖాన్, సిబ్బంది వైద్య సేవలు అందించగా యువకులు నాగరాజు, వేణు, బాపు సురేష్, వెంకటేష్, మహేష్, నరేష్, గంగాధర్, సతన్న, గొట్ల సతాన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని హనుమాన్ ఆలయం వద్ద గత కొన్ని సంవత్సరాల నుంచి శుద్ధి చేస్తున్న కట్ల లింగన్న, భార్య మరణించడంతో ఆ పేద కుటుంబానికి హనుమాన్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఆదివారం రూ.5000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆ పేద కుటుంబాన్ని ఆదుకుంటామని గణేష్ మండలి సభ్యులు తెలిపారు. మిగతా దాతలు ఉదార స్వభావులు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆలయంలో సేవ చేస్తూ అనేక సంవత్సరాలుగా సేవలందించిన ఆమెను అభినందించారు. ఆమె మృతి చెందడంతో ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితి మరింత క్షీణించిందని ఆవేధన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గణేష్ మండలి కమిటీ సభ్యులు గాజుల దేవేందర్, వాసాల నరేష్ గట్టు మహేష్ ముంజంపల్లి సాయికుమార్, పెట్టం రమేష్, చౌక మహేష్, ఓడిపెల్లి రాజేష్, అనుమండ్ల నాగరాజు, ఉల్వకాని మల్లేష్ అంకం మహేష్మని అఖిల్, తుమ్మ సతీష్, సురిమిళ్ళ భాస్కర్, అన్నారపు అశోక్, అన్నారపు పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

5
నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | సెప్టెంబర్ 30, 2024 | www.navatelangana.com

మన్ కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ప్రధాని నరేంద్రమోడీ నిర్వహించిన 114వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కాగజ్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు తిలకించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, సరస్వతి శిశు మందిరాల జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనితతో పాటు పలువురు ఈ దీనిని వీక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోని ప్రతి అంశాన్ని సూచిస్తూ ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడారని, దేశాన్ని అగ్రగామిగా నిలుపడమే బీజేపీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీరభద్రచారి, అరుణ్‌లోయ, అనిల్ సహారే, జాడి మధూకర్, మురళీకృష్ణ, తాటి వెంకటేష్, సంతోష్, మాచర్ల శ్రీనివాస్, అల్లాడి రాజు, ఉల్లెంగుల రవి, విజయలక్ష్మి, జాడి రాజు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని కొండాపూర్ శివారులో 108 అంబులెన్స్‌లో మహిళకు ప్రసవం జరిగింది. తుడుంగూడ గ్రామానికి చెందిన చాకటి కళావతికి పురటి నొప్పులు రావడంతో ఆమె కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గ్రామానికి వెళ్లి అంబులెన్స్‌లో ఎక్కించుకొని కాసిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసువెళ్తున్న క్రమంలో కొండాపూర్ గ్రామ శివారుకు రాగానే నొప్పులు తీవ్ర కావడంతో అంబులెన్స్‌లోనే నార్మల్ డెలవరీ చేశారు. మగ శిశువుకు జన్మనిచ్చింది. ఆ తర్వాత తల్లీబిడ్డలను చికిత్స నిమిత్తం పీహెచ్‌సీకి తరలించారు. కాసిపేట 108 సిబ్బంది ఈఎంటీ డి.ఆత్మారావు, పైలెట్ ఎండీ ఆసద్ పాషాలకు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పోరాటాలే ఏచూరికి ఇచ్చే నివాళులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయడమే సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఇచ్చే నివాళులు అని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ఆదివారం స్థానిక కృష్ణవేణి టాలెంట్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ మాజీ జాతీయ అధ్యక్షులు సీతారాం ఏచూరి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 1974లో ఎస్ఎఫ్ఐలో చేరిన సీతారాం ఏచూరి జెఎన్‌యూలో చేరి యూనివర్శిటీ సమస్యల పరిష్కారానికి పోరాడారన్నారు. ఎమర్జెన్సీ కాలంలో విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతూనే అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ముందు ధైర్యంగా నిలబడి కొట్లాడారని అన్నారు. ఆ కాలంలో దేశంలో ఎస్ఎఫ్ఐ పై ఎన్ని నిర్బంధాలు ఉన్నా వాటినన్నింటిని ఎదుర్కొని బలమైన విద్యార్థి సంఘంగా ఎదిగి అన్ని విశ్వవిద్యాలయాలలో విజయబావుటా ఎగురవేయడానికి కారణం సీతారాం ఏచూరి అని గుర్తు చేశారు. సీతారం ఏచూరి మృతి దేశానికి తీరని లోటని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ, వివిధ సంఘాల నాయకులు మేడి చరణ్‌దాస్, శాంతికుమారి, మధూకర్, కేశవ్, శ్యాంసుందర్, ఖమర్, రాజకమలాకర్ రెడ్డి, మహిపాల్, సుందిళ్ల రమేష్, మోహన్, ముజుములుద్దీన్, ముంజం ఆనంద్‌కుమార్, జయదేవ్, ఓదేలు, నర్సయ్య, వేణు, నాగేశ్వర్‌రావు, కోట శ్రీనివాస్, సుభాష్, రాంచందర్, పొన్న రమేష్ పాల్గొన్నారు.

బీఎంఎస్‌కు అవకాశమిస్తేనే కార్మికులకు న్యాయం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాబోయే ఎస్పీఎం గుర్తింపు కార్మికసంఘం ఎన్నికలలో బీఎంఎస్‌కు అవకాశమిస్తేనే కార్మికులకు న్యాయం జరుగుతుందని ఆ సంఘం అనుబంధ ఎస్పీఎం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కల్లోల భట్టాచార్య అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిల్లు పున:ప్రారంభమైన తర్వాత బీఎంఎస్ ప్రాతినిధ్యం మేరకే కొంత మంది స్థానిక కార్మికులను యాజమాన్యం విధుల్లోకి తీసుకుందని, ఇంకా 260 మంది కార్మికులు విధులకు దూరంగానే ఉన్నారని అన్నారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అనుబంధ సంఘం హయాంలోనే మిల్లు మూసివేతకు గురైందని, రాజకీయ లబ్ది కోసం మిల్లును తెరిపించిన నాయకులు, కార్మికులను విధుల్లోకి తీసుకోకుండా మిల్లులో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. టెన్ మెన్ కమిటీ పేరుతో కేవలం పది మంది కార్మికులతో రహస్యంగా చర్చలు జరిపి, కార్మికశాఖకు సమాచారం ఇవ్వకుండా యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గుర్తింపు సంఘం ఎన్నికలలో బీఎంఎస్‌కు అవకాశమిస్తే మెరుగైన వేతన ఒప్పందంతో పాటు క్యాంటీన్, ఇతర మౌళిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీఎంఎస్ నాయకులు వెంకటేష్, గణపతి, మోర్లె నానాజి, అన్నం రాజన్న పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

నవతెలంగాణ-మంథని

సెప్టెంబర్ 30న చేపట్టబోయే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని కార్మికులు కర్షకులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. ఆదివారంమంథని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యంరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేసి కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని స్థానిక సమస్య లైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన వెయ్యి రూపాయల వేతనాన్ని మంథని మున్సిపాలిటీలో అమలు చేయడం లేదనన్నారు. ఎన్ఎంఆర్ కార్మికులను కాంట్రాక్టు పద్ధతిలో విలీనం చేయాలని,పెండింగ్‌లో ఉన్న సబ్బులు, నూనెలు, చెప్పులతోపాటు బట్టల కూలి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కొరకు సోమవారం చేపట్టబోయే చలో కలెక్టరేట్ కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్, మున్సిపల్ కార్మికులు చిప్పకుర్తి చందు, ఎడ్లపల్లి రాజయ్య సింగారపు గట్టయ్య, రాజయ్య, భాగ్య పాల్గొన్నారు.

నిరుపేద ఆటో డ్రైవర్‌ను ఆదుకోండి

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్

పెద్దపల్లి పట్టణం చింతలవాడకు చెందిన ఆటో డ్రైవర్ మొహమ్మద్ ఖాజా మోహియొద్దీన్ అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్నాడని అతని ఆరోగ్య ఖర్చులకు దాదాపు 5 లక్షల వరకు ఖర్చవుతుందని, తమ దగ్గర అంత డబ్బు పెట్టే స్తోమత లేదని అతని భార్య ఆవేదన వ్యక్తం చేసింది.తన భర్త ఆటో నడుపు కుంటూ తన ఇద్దరు పిల్లల ను పోషించే వాడని, నడుము కింద భాగంలో హిప్ రిప్లేస్‌మెంట్ చేయాలని, అప్పుడే అతను నడవగలుగుతాడని డాక్టర్లు వెల్లడించారని, అతని ఆపరేషన్ ఖర్చులకు దాదాపు 5 లక్షల వరకు ఖర్చవుతుందని, దాతలు ఎవరైనా ఉంటే తమను ఆదుకోవాలని వేడుకున్నారు. ఫోన్ పే, గూగుల్‌పే ఫోన్ నెంబర్ 9866569257కు దాతలు సహాయం చేయాలని వేడుకున్నారు.

జిల్లాలో చిన్న పిల్లల వైద్యుల కొరత

- మంచిర్యాల ప్రధాన ఆస్పత్రిలో 14 మందికి ఇద్దరే
- పనిచేసేందుకు ముందుకు రానివైనం
- ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న బాధితులు



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చే పిల్లలకు కష్టాలు తప్పడం లేదు. సరిపడా చిన్న పిల్లల డాక్టర్‌లు లేక పోవడంతో సరైన వైద్యం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనితో గత్యంతరం లేక కొందరు అందుబాటులో ఉన్న ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. బాధితులు జిల్లాలో వైరల్ ఫీవర్స్ ప్రభలుతున్న నేపథ్యంలో పెద్దలతో పాటు చిన్న పిల్లలు సైతం విష జ్వరాల బారిన పడుతున్నారు. ఆర్థికంగా ఉన్న వారు ప్రయివేట్ ఆస్పత్రులను సంప్రదించగా, పేదలు ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. ఒక్క మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తప్ప మండలాల వారీగా ఉన్న పీహెచ్‌సీల్లో చిన్న పిల్లల వైద్యులు లేరు. బెల్లంపల్లిలో ఒకరు లక్షెట్టిపేట లో ఒక్కరు చిన్న పిల్లల వైద్యులు ఉన్నపటికీ వారు వారి ప్రయివేట్ ఆస్పత్రిలోనే ఎక్కువ గడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. లక్షెట్టిపేటలో తాత్కాలిక భవనం ఇంకా అందుబాటులోకి రాక పోవడం తో ఇప్పుడు ఉంటున్న అద్దె షెడ్డులోనే నెట్టుకొస్తున్నారు. సరి పడ బెడ్ లు, రోగులను పరీక్షించేందుకు గదులు లేక పోవడం తో అక్కడికి వెళ్ళాలి అంటేనే రోగులు జంకుతున్నారు. ఇంకా పిల్లలకు సంబంధించిన ఎటువంటి సదుపాయలు లేక పోవడంతో లక్షెట్టిపేట్ పరిసర ప్రాంతాల నుంచి చిన్న పిల్లలతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. తల్లి తండ్రులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో 14 మంది చిన్న పిల్లల డాక్టర్‌లు పని చేయాల్సి ఉండగా కేవలం ఇద్దరే వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. ప్రతి రోజు 50 వరకు ఓపీ ఉండగా అందులో 20 కేసులు అడ్మిట్ చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. జిల్లా నలుమూలల నుంచి మంచిర్యాలకు జనాలు క్యూ కట్టడంతో పని ఒత్తిడి కారణంగా విధులు నిర్వహించలేని



పిడియాట్రీషన్‌లు లీవ్‌లు, ఉద్యోగం చేయలేమాంటూ అధికారులకు లెటర్‌లు పెట్టి విధుల నుంచి తప్పుకుంటున్నారు. దీనితో అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పిల్లలకు సరి అయిన వైద్యం అందడంలేదు. ఇద్దరు ప్రొఫెసర్‌లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్‌లు, 6 గురు పిల్లల నిపుణులు, చంటి పిల్లల విభాగంలో నలుగురు ఉండాల్సి ఉండగా గత కొంత కాలంగా కేవలం ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో పని చేసిన నలుగురు విధులు నిర్వర్తించలేమని ఉన్నత అధికారికి తెలిపి విధుల నుండి తప్పుకున్నట్లు సమాచారం.

అధికారి తీరుపై విమర్శలు

జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌లోని పిల్లల విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉన్నత స్థాయి అధికారి తీరుపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఆ అధికారి అహంకారానికి జిల్లాకు చెందిన చిన్న పిల్లల వైద్యులు విధులకు రాజీనామా సమర్పించి ఉన్నత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఇటివలా జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న 4 గురు పిల్లల డాక్టర్‌లు సైతం విధులు నిర్వర్తించలేము అంటూ ఉన్నత స్థాయి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. అయినప్పటికీ అధికారి పద్ధతిలో ఎటువంటి మార్పు రాక పోవడంతో విధుల నుండి తొలిగిపోయినట్లు తెలుస్తోంది. వైద్యుల మధ్య సయోధ్య లేక పోవడం తోనే ఇన్ని సమస్యలు తలేత్తుతున్నట్లు ఉన్నత అధికారులు గుర్తించారు. విధుల నుంచి వెళ్లి పోయిన వైద్యులను తిరిగి విధుల్లోకి తీసుకునే ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులు ఇటీవల పిడియాట్రీషన్‌లు అందరూ కలిసి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడు, ఆయన ఉంటే మేము విధులు నిర్వర్తించలేము అంటూ అట్టి అధికారిపై ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, డీఎంఎ అధికారులకు ఫిర్యాదు చేయడం చర్చ నియంశమైంది. ప్రభుత్వ ఆస్పత్రి సుపరింటెండెంట్, డీఎంఎ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం కాస్త బయటకు వచ్చింది. జరిగిన విషయంపై ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ హరీష్ చంద్రరెడ్డిని వివరణ కోరగ వచ్చిన ఫిర్యాదును ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, చిన్న పిల్లల డాక్టర్‌లను ఏర్పాటు చేసుకునే పనిలో ఉన్నామన్నారు.

రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలను ఎటువంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా 2వ ఏఎన్ఎం యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు టి దివాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ప్రజల ఆరోగ్యాలను కాపాడడంలో రెండవ ఏఎన్ఎంలు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో రెడ్ జోన్లలోకి వెళ్లి పని చేశారని గుర్తు చేశారు. కరోనా సమయంలో అనేక ఇబ్బందులకు గురయ్యారని అయినప్పటికీ ప్రభుత్వాలు వీళ్ళ సేవలను గుర్తించడం లేదని విమర్శించారు. గత సంవత్సర కాలం క్రితం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వీరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్‌తో సమ్మె చేయడం జరిగిందని అప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు సమ్మె శిబిరాల వద్దకు వచ్చి కాంగ్రెస్‌కు ఓటు వేయండని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మిమ్మల్ని అందరిని రెగ్యులర్ చేస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. నేటికీ 9 నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీ మరిచిపోయిందన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, 25 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, ఇవ్వాలని డిమాండ్ చేశారు. 100 శాతం గ్రాస్ సాలరీ ఇవ్వాలని, కాంట్రాక్ట్ విధానంలో పనిచేసినపూర్తి కాలానికి వారికి గ్రాట్యుటీ చెల్లించాలని, ఐదు వేల పైన పాపులేషన్ ఉన్నవారికి అదనంగా కేటాయించాలని కోరారు. పర్మనెంట్ ఉద్యోగుల మాదిరిగా సెలవులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు ఆత్మకూరి చిరంజీవి, రెండవ ఏఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, కోశాధికారి సునీత నాయకురాలు వసంత, గోదావరి, శైలజ, లక్ష్మి లలిత, భాగ్, స్వరూప, జ్యోతి పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో గోలేటి వాసి ప్రతిభ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఈ నెల 25 నుండి 29వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని రోతక్ జిల్లాలో జరిగిన 43వ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలలో రెబ్బెన మండలం గోలేటికి చెందిన దామెర ప్రేమ్‌దీప్ ప్రతిభ కనబర్చాడు. ఈ పోటీలలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన జట్టు తృతీయ స్థానంలో నిలువగా, ఈ టీంకు కెప్టెన్‌గా ప్రేమ్‌దీప్ వ్యవహరించారు. బెస్ట్ టాప్ ఫైవ్ ప్లేయర్‌గా దామెర ప్రేమ్‌దీప్‌ను ఇండియన్ బాల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ అవార్డుతో సత్కరించింది. దీనికి ముందు ప్రేమ్‌దీప్ 2023లో కర్ణాటకలో జరిగిన సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలలో ఆడారు. ప్రేమ్‌దీప్ రెబ్బెన మండలం గోలేటి సింగరేణి పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బెస్ట్ ప్లేయర్ అవార్డు సాధించిన ప్రేమ్‌దీప్‌ను బాల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కల నారాయణరెడ్డి, తెలంగాణ రాష్ట్ర అసోషియేషన్ సంయుక్త కార్యదర్శి ఎస్ తిరుపతి, ఎం శ్రీనివాస్, బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్, సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు ప్రేమ్‌దీప్‌ను అభినందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-గోదావరిఖని

రామగుండం కార్పొరేషన్ 7వ డివిజన్ పవర్ హౌస్ కాలనీలో ఎస్‌డీఎఫ్ 5లక్షల రూపాయల నిధులతో రోడ్డు నిర్మాణ పనులకు టెండర్ పూర్తి కాగా, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు ఎండీ. నజీముద్దీన్ అధ్యక్షతన ఆదివారం శంకుస్థాపన చేపట్టారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, 7వ డివిజన్ కార్పొరేటర్ వేగోళపు రమాదేవి శ్రీనివాస్, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంకణాలు మౌనిక రాజు, అరిఫ్, కోదాటి వినోద్, అజయ్, అక్బర్, కళ్యాణ్, ఓదెలు, కాలనీవాసులు ఆర్కొటి శంకర్, దశరథం, నరేష్, విమల, నంది వెంకటేష్ తదితరులున్నారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దసరా సెలవుల నేపథ్యంలో ఆదిలాబాద్ రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి 412 ప్రత్యేక బస్సులను జేబీఎస్ నుంచి నడుపుతున్నట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎం సొలొమాన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ డిపో నుండి 78, ఆసిఫాబాద్ డిపో నుండి 73, భైంసా డిపో నుండి 11, మంచిర్యాల డిపో నుండి 125, నిర్మల్ డిపో నుండి 120, ఉట్నూర్ నుండి ఐదు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక బస్సులు అక్టోబర్ 1 నుంచి 11 వరకు నడుస్తాయని పేర్కొన్నారు.

రైతు భరోసాను అమలు చేయాలి

మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

నవతెలంగాణ-పెద్దపల్లిటౌన్

రైతు రుణమాఫీ చేసి, రైతు భరోసాను వెంటనే అమలు చేసి రైతుల ఖాతాలో జమ చేయాలని కోరుతూ పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి కోరారు. ఆయన ఆధ్వర్యంలో రుణమాఫీ కానీ రైతులతో అక్టోబర్ 1తేదీన ఉదయం 11.00 గంటలకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి, ఏలాంటి సాంకేతిక లోపాలు ఉన్నా వెంటనే సవరించి రెండు లక్షల రూపాయల రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ చేయాలని కోరడం జరుగుతుందన్నారు.

మంత్రి ఆదేశాల మేరకే చేరిక నిలిపివేత

నవతెలంగాణ-ముత్తారం

మంత్రి శ్రీధర్‌బాబు, యువ నాయకుడు శ్రీనుబాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ ముత్తారం మండల నాయకులను, హరిపురం గ్రామ కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలనను సంప్రదించిన తరువాతనే వారి అభీష్టం మేరకు కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నాయకుని చేరికను నిలిపివేయడం జరిగిందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకత్వంలో ఎలాంటి గ్రూపు తగాదాలు లేకుండా చాలా పటిష్టంగా ఉంది కాబట్టే గత అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ భారీ మెజార్టీ తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేతగానితనం ఏందో మండల ప్రజలందరికీ తెలుసునని, ఇకనైనా మీ ఇల్లు మీరు సరిదిద్దుకోవాలని హితవు పలికారు. అధికారంలో ఉన్నప్పుడే 10 గ్రూపులుగా విడిపోయిన పార్టీ బీఆర్ఎస్‌దని, మొదట మీ పార్టీని చక్కదిద్దుకోవాలని సూచించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన కార్యకర్తల, నాయకుల సమన్వయంతో మండల నాయకత్వంగా పటిష్టంగా పనిచేస్తుందని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జంపు చేసే నాయకులు ఎవరూ మాకు అవసరం లేదని అన్నారు. ఇలాంటి మీ వైఖరి వల్లనే బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకుంటు న్నారని, అది మీ చేతగానితనానికి నిదర్శనమని పేర్కొన్నారు.

జాతీయ అవార్డు అందుకున్న అడవీ శ్రీరాంపూర్ కళాకారుడు

నవతెలంగాణ-ముత్తారం

ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ కళాకారుడు తోడేటి శశి కుమార్ జాతీయ అవార్డు అందుకున్నారు. తిరుపతిలో శ్రీ స్వరవాని కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం సందర్భంగా నేషనల్ పురస్కారంను ఆయన పలువురు అతిథులు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న శశి కుమార్‌ను గ్రామ కళాకారులు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు.

నేడు సహకార సంఘం సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-మంథని

మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం12 గంటలకు నిర్వహించ తలపెట్టినట్లు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో సంఘ జమఖర్చులు, అంచనా బడ్జెటు, ఇతర అంశాలపై చర్చించి తీర్మాణించనున్నట్లు తెలిపారు. కాగా ఈ సమావేశానికి సంఘ పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, రైతులు, మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.